క్లుప్తంగా

రేపు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మంగువారితోట సంపత్ వినాయక దేవాలయం వద్ద వినాయక చవిత పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల నాలుగో తేదీన మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ఆ రోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి బొమ్మలను అందజేస్తామని ఆలయ ధర్మకర్త కొండా రాంబాబు, అర్చకులు గోవిందు వెంకట రామారావు శర్మలు సోమవారం తెలిపారు.

అరసవల్లిలో వనమహోత్సవం



పుష్కరిణి ఆవరణలో మొక్కను నాటుతున్న ఈవో రమేష్‌బాబు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయ ఆవరణలో ఈవో డి.ఎల్.వి.రమేష్‌బాబు ఆధ్వర్యంలో వనమహోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఇంద్రపుష్కరిణి ఆవరణలో ఈవో రమేష్ బాబు, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మలు మొక్కలు నాటారు. అర్చకబృందం, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్పీకి సీతంవలస గ్రామస్తుల వినతి



డీఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న రమేష్ కుటుంబసభ్యులు, గ్రామస్తులు

శ్రీకాకుళం క్రైమ్: రణస్థలం మండలం సీతంవలస గ్రామస్తులు శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానందను తన కార్యాలయంలో సోమవారం కలిశారు. ధర్మాన ఈశ్వరరావు చిన కుమారుడు రమేష్‌ను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారంటూ కుటుంబసభ్యులతో పాటు గ్రామానికి చెందిన 30 మంది వరకు వచ్చి వినతిపత్రం అందజేశారు. ఇదే విషయమై ఇప్పటికే కుటుంబసభ్యులు ఎస్పీని కూడా కలిశారు. డీఎస్పీ స్పందిస్తూ దీనిపై విచారణ చేసి న్యాయం చేస్తామని అన్నారు.

తాగునీరు వృథా



కుళాయిలకు పాడైన ట్యాప్‌లు

ఎచ్చెర్ల క్యాంపస్: సంతసీతారాంపురం పంచాయతీ చినరావుపల్లిలో తాగునీటి కుళాయిలు మరమ్మతులకు గురయ్యాయి. కుళాయిలకు ట్యాప్‌లు లేకపోవటం, ఉన్నవి పాడవ్వటంతో తాగునీరు వృథాగా పోతోంది. వృథాగా పోతున్న నీటిని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఇంటింటా ఆరోగ్య సర్వే



ఇంటింటా సర్వే చేస్తున్న వైద్యులు, సిబ్బంది

జి.సిగడాం: మండలంలోని వెలగాడ గ్రామంలో గత రెండు రోజుల నుంచి డయేరియా కేసులు నమోదు కాలేదని బాతువ ఆరోగ్య కేంద్రం వైద్యులు అనూష, ప్రతిష్ట శర్మ తెలిపారు. సోమవారం వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. అవసరమైన వారికి వైద్యం, మందులు అందించారు.

నేడు మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా జరగనుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు సోమవారం తెలిపారు. కళాశాల నోడల్ రిసోర్స్ సెంటర్, ఏపీఎస్ఎస్‌డీసీ సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటకు జరిగే ఈ జాబ్‌మేళాలో డాక్టర్ రెడ్డీస్, ఏటీసీ టైర్స్, అపోలో ఫార్మా కంపెనీల్లోలతోపాటు ఐ స్మార్ట్ సొల్యూషన్స్, ట్రెండ్స్, మంగళం స్టోర్స్, అన్‌లిమిటెడ్, మహేంద్రా ఫైనాన్స్, కళానికేతన్ వంటి సంస్థల్లో ఉద్యోగాల భర్తీ కోసం ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి టెన్త్‌క్లాస్ పాస్/ఫెయిల్ నుంచి ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, ఫార్మసీ, పీజీ, ఎంబీఏ, తదితర కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు ఉద్యోగాలకు అర్హులని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు ఆకర్షణీయమైన జీతం, ఇతర అలవెన్సులను ఆయా సంస్థలు అందజేయనున్నట్టు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు బయోడేటాతోపాటు విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్ల జిరాక్స్‌కాపీలు, మూడు పాస్‌ఫొటోలతో హాజరు కావాలని సూచించారు.

వైఎస్సార్ ఆశయ సాధనకు పునరంకితం

● వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం క్రైమ్ : వైఎస్ రాజశేఖర రెడ్డి ఆశయ సాధనకు అందరం పునరంకితమవుదామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. వైఎస్సార్ చనిపోయి 15 ఏళ్లవుతున్నా ఆ మహానేతను ప్రజలంతా తమ గుండెల్లో ఉంచుకున్నారని అన్నారు. సోమవారం వైఎస్సార్ 15వ వర్ధంతి సందర్భంగా జిల్లాకేంద్రంలోని ఏడురోడ్ల కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ 21 ఏళ్ల అనంతరం కాంగ్రెస్ పార్టీని ఉమ్మడి రాష్ట్రంలో గెలిపించి వైఎస్ ముఖ్యమంత్రి అయ్యారని, ప్రజలకు మేలైన సంక్షేమ కార్యక్రమాలు, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించి చిరస్థాయిగా నిలిచారన్నారు. వైఎస్ హయాంలోనే జిల్లాలో రూరల్ యూనివర్సిటీ, రిమ్స్ మెడికల్ కాలేజీ, వంశధార, కరకట్టలు, ఆఫ్‌షోర్ రిజర్వాయర్, రహదారుల అభివృద్ధి జరిగిందన్నారు. రాష్ట్రంలో రైతులకు ఉచిత విద్యుత్, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు, పేదలకు ఇళ్లు, రైతు రుణ మాఫీ, వైద్యానికి సంబంధించి ఆరోగ్యశ్రీ వంటి పథకాలతో పేద ప్రజల గుండెల్లో చిరస్థానం సంపాదించారని తెలిపారు. ఆయన తనయుడు వైఎస్ జగన్ సైతం తండ్రి బాటలోనే నడిచి విద్య, వైద్యం, వ్యవసాయానికి పెద్దపీట వేయడమే కాక నవరత్నాల పేరుతో సంక్షేమ ఫలాలను అందించి 100 శాతం మేనిఫెస్టో అమలుకు కృషి చేశారన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్నవారు అబద్ధాలతో కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ఎంవీ పద్మావతి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు, కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, మాజీ కళింగ కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, పట్టణ అధ్యక్షులు సాధు వైకుంఠరావు, గొండు కృష్ణమూర్తి, అంబటి శ్రీను, ఎన్ని ధనుంజయ్, మెంటాడ స్వరూప్, చల్లా రవికుమార్, పొన్నాడ రుషి, మహ్మద్ రఫీ, కామేశ్వరి, విజయ, మండవల్లి రవి తదితరులు పాల్గొన్నారు.



జి.సిగడాం: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కాంగ్రెస్ నాయకుల నివాళి

శ్రీకాకుళం అర్బన్: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి అని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనియాడారు. వైఎస్ వర్ధంతి సందర్భంగా శ్రీకాకుళంలోని ఇందిరావిజ్ఞాన్ భవన్‌లో రాజశేఖరరెడ్డి విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజశేఖరరెడ్డి పరిపాలనలో అన్నివర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శులు సనపల అన్నాజీరావు, అంబటి కృష్ణారావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు డి.గోవింద మల్లిబాబు, అంబటి దాలి నాయుడు, రమేష్ కుమార్, రవికుమార్, జి.పి.నాయుడు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం బైపాస్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రణస్థలం మండలంలో..

రణస్థలం: పేదల పెన్నిది దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మహానేత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా జే.ఆర్.పురం పోలీస్ స్టేషన్ కూడలిలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మరణం లేని వ్యక్తిగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానుభావుడు వైఎస్సార్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, పార్టీ మండల నాయకులు మహంతి పెదరామినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, లంకలపల్లి ప్రసాద్, మైలపల్లి కామరాజు, రెడ్డి విశ్వేశ్వరరావు, మహంతి చినరామినాయుడు, గొర్లె అప్పలనర్సునాయుడు, పిల్ల ఆనందపాత్రుడు, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు గురాన మానస, జే.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, పచ్చిగుళ్ల సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం క్రైమ్: వైఎస్సార్ కూడలి వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

రోగులకు పండ్ల పంపిణీ

పేదలకు ఆరోగ్య శ్రీ అందించి ఎన్నో కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా రణస్థలం సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు సోమవారం పండ్లు పంపిణీ చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

జి.సిగడాం మండలంలో..

జి.సిగడాం: వైఎస్సార్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ కోరారు. సోమవారం మండలంలోని సర్వేశ్వరపురం కూడలి వద్ద వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, మండల బూత్ కన్వీనర్ అబోతుల జగన్నాథం, జిల్లా కార్యవర్గ సభ్యుడు పిల్లల శివకుమార్, సర్పంచ్‌లు చందక సతీష్, కుమరాపు శ్రీనివాసరావు, తొత్తడి రామారావు, ఎంపీటీసీలు బూటు అప్పారావు, పెద్ది శ్రీనివాసరావు, కుమరాపు సన్యాప్పలనాయుడు, నల్లి తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల మండలంలో

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో పలు గ్రామాల్లో వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించారు. కుశాలపురం బైపాస్ కూడలి, పొన్నాడ, కుప్పిలి, బొంతలకోడూరు గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సనపల నారాయణరావు, బల్లాడ జనార్దనరెడ్డి, జరగుళ్ల శంకరరావు, పంచిరెడ్డి రాంబాబు, బల్లాడ జనార్దనరెడ్డి, నక్క కృష్ణ మూర్తి, నేతింటి నీలం, బెండు రామారావు, అంబటి రాంబాబు, కొత్తకోట సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

లావేరు మండలంలో..

ఎచ్చెర్ల: లావేరు గ్రామంలో వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు రొక్కం బాలకృష్ణ నివాళులర్పించారు. వైఎస్సార్ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, నాయకుడు బొంతు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల: లావేరులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



శ్రీకాకుళం అర్బన్: రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



రణస్థలం: రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న సాయికుమార్

అధ్వానంగా శాంతినగర్‌కాలనీ రోడ్లు!



డీఎస్ఏ ఇండోర్ స్టేడియంకు వెళ్లే రోడ్డు దుస్థితి



ఆర్ట్స్ కళాశాల నాలుగో గేట్, మున్సిపల్ వాటర్ సరఫరా కేంద్రం వద్ద శిథిలమైన రోడ్డు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలో అత్యంత రద్దీగా ఉండే మార్గాలలో శాంతినగర్‌కాలనీ ఒకటి. ఈ కాలనీ గుండా రిమ్స్ హాస్పటల్, మెడికల్ కాలేజీ, ప్రభుత్వ పురుషుల డిగ్రీ, జూనియర్ కళాశాలలు, నాగావళి పార్క్, ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్, మూడు స్కూళ్లు, వసతి కేంద్రాలు, బలగ మార్గంలో అవసరమైన ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ మార్గాన్నే వాహనదారులు అనుసరిస్తారు. ఇక్కడే ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ స్థిరనివాసం ఉంటున్నారు. ఇటువంటి కాలనీకి వెళ్లే ప్రధాన మార్గం పూర్తిగా అధ్వానంగా తయారైంది. ప్రధాన మార్గంతో పాటు కాలనీలో డీఎస్ఏ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లేమార్గం అత్యంత దయనీయంగా ఉంది. తాజాగా కురిసిన వర్షాలతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ స్టేట్‌మీట్ పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే క్రీడాకారులు, టెక్నికల్ సిబ్బంది, అతిథులతో పాటు ప్రజాప్రతినిధులు సైతం హాజరుకానున్నారు. శాంతినగర్‌కాలనీకి వెళ్లే ప్రధాన మార్గంతోపాటు కాలనీల్లోని ఉన్న రోడ్లను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మైదానంలో నీరు.. వాకర్లు లేరు!



శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి క్రీడా ప్రాంగణం వర్షపునీరుతో పూర్తి చిత్తడిగా మారిపోయింది. ఎలాగూ క్రీడలు, ఆటలకు పనికిరాని ఈ మైదానం.. వాకర్లుకు ఉపయుక్తంగా ఉండేది. తాజాగా కురుస్తున్న వర్షాలతో మైదానం చిత్తడిగా మారడంతో వాకర్లు దూరంగా ఉంటున్నారు. దీంతో క్రీడాప్రాంగణం వెలవెలబోతోంది.

– శ్రీకాకుళం న్యూకాలనీ

గణేష్ మండపాల ఏర్పాటుకు సింగిల్ విండో విధానం

● డీఆర్‌వో అప్పారావు

శ్రీకాకుళం పాతబస్టాండ్:

వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించిన అన్ని అనుమతులు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని శ్రీకాకుళం రెవెన్యూ అధికారి ఎం.అప్పారావు తెలిపారు. ఈ మేరకు తన చాంబర్‌లో సోమవారం సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వినాయక మండపాల అనుమతులతో పాటు 79950 95800 మొబైల్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా ఏజీ అని సందేశం పంపిస్తే చాలు, నిరభ్యంతర పత్రం కోసం అనుసరించవలసిన ప్రక్రియ మొత్తం వాట్సాప్ ద్వారా చేరుతుందన్నారు. మిగిలిన వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరచాలన్నారు. శ్రీకాకుళం నగర పరిధిలో విగ్రహాలను నిమజ్జనం చేయడానికి నాలుగు ప్రాంతాలను ఎంపిక చేసినట్టు చెప్పారు. అందులో పొన్నాడ, ఏడు రోడ్లు, డే అండ్ నైట్ కూడళ్ల వద్ద ఉన్న వంతెనలతో పాటు పెద్దపాడు చెరువును గుర్తించామన్నారు. రాత్రి పది గంటల్లోగానే విగ్రహాలను నిమజ్జనం చేయాలన్నారు. ఉత్సవ కమిటీలు కచ్చితంగా నిబంధనలు పాటించాలన్నారు. ఆర్డీవో సీహెచ్ రంగయ్య, డీఎస్పీ వివేకానంద, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ఓబిలేసు, టౌన్ సీఐలు పాల్గొన్నారు.

చదివిన బడి బాగు కోసం..

● పూర్వ విద్యార్థుల కృషి
● 4న భోజన షెల్టర్ ప్రారంభం



ప్రారంభానికి సిద్ధమైన భోజన షెల్టర్



సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: చదువుకున్న బడి అభివృద్ధి కోసం వారంతా ఏకమయ్యారు. సరస్వతీ నిలయానికి కొత్త సొబగులు తీసుకురావాలని సంకల్పించారు. వచ్చిన ఆలోచనను ఆచరణలో పెట్టారు. దీనికి శ్రీకాకుళం నడిబొడ్డులో ఏడు రోడ్ల కూడలి వద్ద ఉన్న వందేళ్ల చరిత్ర కలిగిన మున్సిపల్ హైస్కూల్ హైస్కూల్ వేదికైంది. ఇక్కడ చదువుకున్న ఎంతోమంది వివిధ రంగాల్లో ఉన్నత స్థానంలో ఉన్నారు. అయితే తాము చదువుకుంటున్న స్కూల్ శిథిలస్థాయిలో ఉందని తెలుసుకొని పూర్వ విద్యార్థులు కలత చెందారు. బడి బాగు కోసం నడుం బిగించారు.

పూర్వ విద్యార్థుల సంఘం ఆవిర్భావం

2013లో మొదటిగా వచ్చిన ఆలోచనతో కొందరు పూర్వ విద్యార్థులు అందరూ కలిశారు. వారి సూచనల మేరకు మరి కొంతమంది పూర్వ విద్యార్థుల బ్యాచ్‌లను ఒకటి చేసి స్కూలు బాగు కోసం ఏదైనా చేయాలని సంకల్పించారు. అందుకు తమవంతు సాయం అందించాలని సిద్ధపడ్డారు. ఇటీవల పూర్వ విద్యార్థుల ఆత్మీ సమ్మేళనాలను తరచూ బ్యాచ్‌ల వారీ నిర్వహిస్తున్నారు. దీన్ని తెలుసుకున్న కొందరు పూర్వ విద్యార్థులు ఆలోచించి అన్ని బ్యాచ్‌లను ఒకటిగా చేశారు. 1956 నుంచి 1989 వరకు ఉన్న 24 బ్యాచ్‌లను ఒకే వేదికపైకి తీసుకొచ్చి 2013లో ఒక సంఘంగా ఏర్పాటు చేశారు. ఈ సంఘం ఆధ్వర్యంలో ఇస్కూలు అభివృద్ధితోపాటు ఇక్కడ చదువుతున్న విద్యార్థులకు కూడా ప్రోత్సాహక పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సంఘాన్ని పటిష్టం చేసేందుకు 2016లో సొసైటీ చట్టం కింద రిజిస్ట్రేషన్ కూడా చేశారు.

కమిటీ సభ్యులు వీరే

మున్సిపల్ హైస్కూల్ పూర్వవిద్యార్థుల సంఘం గౌరవ అధ్యక్షులుగా హనుమంతు లజపతిరాయ్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వి.జి.కె.మూర్తి, జామి భీమశంకర్, కోశాధికారిగా జె.ఎస్.ఎస్.ప్రకాశరావు, ఉపాధ్యక్షులుగా చేబోలు విశ్వేశ్వరరావు, పేర్ల కామారాజు, కిల్లాన ఫాల్గుణరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా తర్లాడ బాలమురళీకృష్ణ, సహాయ కార్యదర్శులుగా సీహెచ్ వరప్రసాద్, పాలిశెట్టి మల్లిబాబు, మండ శ్రీనివాసరావు, కె.ఎల్.ఎన్.మూర్తి, ఢిల్లి భాస్కరరావు, ఎం.ప్రభాకరరావు వ్యవహరిస్తున్నారు.

అధికారులను సంప్రదించి..

తాము చదువుకున్న మున్సిపల్ స్కూల్‌లోని కొన్ని గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో వాటికి అధికారులు తాళాలు వేశారు. దాన్ని గమనించిన పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు మున్సిపల్ అధికారులను సంప్రదించారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా వాటిని ముందుగా కూల్చి వేయించారు.

విద్యార్థులను ప్రోత్సహిస్తూ..

ఏటా పూర్వ విద్యార్థుల సంఘం పాఠశాలలో పలు కార్యక్రమాలను నిర్వహించి విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రోత్సాహకాలను అందిస్తున్నారు. ఆగస్టు 15, ఉపాధ్యాయుల దినోత్సవం, స్కూలో ఆ ఏడాది 10వ తరగతిలో స్కూల్ ఫస్టు, జిల్లా స్థాయిలో కూడా వచ్చిన వారిని గుర్తించి ప్రశంసా పత్రాలతో పాటు నగదు ప్రోత్సాహకాలను అందిస్తున్నారు. ఇలాంటి ఒక సమావేశానికి అప్పటి జిల్లా కలెక్టర్ లక్ష్మీ నరసింహం హాజరైనపుడు స్కూల్ భవనాల కోసం చర్చించగా రూ.45 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో పాడైన తరగతి గదులను పునః నిర్మాణం చేపట్టారు. నిధుల చాలక పోతే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన 'నాడు–నేడు' పథకం కింద మంజూరు చేసిన నిధులను కూడా వాటిపై ఖర్చు చేసి పైన, కింద గదుల నిర్మాణాలను పూర్తి చేశారు. అలాగే ఇటీవల పార్లమెంటు సభ్యులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు కూడా తననిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు చేసి గతంలో ఉన్న తిలక్ హాలుకు బదులుగా పెద్ద హాలు నిర్మాణం చేపట్టారు. ఈ అభివృద్ధి పనులకు పూర్వ విద్యార్థుల సంఘం కీలకభూమిక పోషించింది.

రూ.ఐదున్నర లక్షలతో భోజన షెడ్డు నిర్మాణం


పూర్వ విద్యార్థుల సంఘం స్కూల్ అభివృద్ధి కోసం 24 బ్యాచ్‌ల నుంచి సహాయం కోసం ప్రయత్నించగా అందులో పది బ్యాచ్‌ల విద్యార్థులు ముందుకు వచ్చి స్కూల్ అభివృద్ధి కోసం విరాళాలను అందించారు. ఆ అభివృద్ధి ఫండ్ సుమారుగా రూ.16 లక్షలు బ్యాంకులో ఉంచారు. దానితో ఎదైనా శాశ్వత సహాయం అందించేందుకు ఆలోచన చేశారు. విద్యార్థులు భోజనం కోసం స్కూలో ఎటువంటి షెల్టర్ లేకపోవడం గుర్తించారు. వెంటనే ఐదున్నర లక్షల రూపాయలతో భోజన షెల్టర్ నిర్మించారు. దీన్ని ఈ నెల నాలుగో తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభించనున్నట్లు సంఘం ప్రతినిధులు వి.జి.కె.మూర్తి, జామి భీమశంకర్ సోమవారం తెలిపారు.

ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ సాధనలో క్రీడాకారులు



రాష్ట్ర బ్యాడ్మింటన్ పోరుకు సిద్ధం

● నేటి నుంచి 6వ తేదీ వరకు మెగా బ్యాడ్మింటన్ టోర్నీ
● 3న క్వాలిఫయింగ్ రౌండ్స్, 4నుంచి మెయిన్ డ్రా పోరు మొదలు
● జిల్లా కేంద్రంలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియం వేదికగా పోటీల నిర్వహణ



శ్రీకాకుళం న్యూకాలనీ:

సిక్కోలు వేదికగా **రాష్ట్ర** బ్యాడ్మింటన్ పోటీలకు **సర్వం** సిద్ధమైంది. ఏపీబీఏ, **బాయ్** సహకారంతో శ్రీకాకుళం **జిల్లా** షటిల్ బ్యాడ్మింటన్ **అసోసియేషన్** ఆధ్వర్యంలో నేటి నుంచి **6** వరకు ఏపీ రాష్ట్రస్థాయి (అంతర్‌జిల్లాల) జూనియర్స్ (అండర్–19) బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న డీఎస్ఏ ఇండోర్ స్టేడియం వేదికగా ఈ టోర్నీని నిర్వహించనున్నారు. కార్యనిర్వహణ, ఆహ్వానం, వసతి, భోజనాలు, టెక్నికల్, రిఫ్రెష్‌మెంట్స్ ఇలా ఇప్పటికే 9 కమిటీలను నియమించారు. ఇప్పటికే బ్యాడ్మింటన్ కోర్టులకు తుది మెరుగులు దిద్దారు. మొదటి రోజున క్వాలిఫైయింగ్ రౌండ్స్ నిర్వహిస్తుండగా, 4వ తేదీ నుంచి 6 వరకు మెయిన్ డ్రా పోటీలు జరగనున్నాయి. ఇక్కడ విజేతలుగా నిలిచిన క్రీడాకారులు ఈనెల 8 నుంచి 11 వరకు రాజమండ్రి వేదికగా జరిగే సౌత్‌జోన్ నేషనల్స్ బ్యాడ్మింటన్ పోటీలకు నేరుగా అర్హత సాధిస్తారు. కొనసాగింపు జూనియర్ నేషనల్స్ మీట్ నవంబర్ 3వ వారంలో భువనేశ్వర్ వేదికగా జరగనున్నాయి.

13 జిల్లాల నుంచి క్రీడాకారుల రాక..

ఈ మెగా మీట్‌లో జరిగే ఈ టోర్నీలో ఉమ్మడి 13 జిల్లాల నుంచి 200 మంది వరకు క్రీడాకారులతోపాటు కోచ్ మేనేజర్లు హాజరవుతున్నారు. సోమవారం సాయంత్రం, రాత్రికి వీరంతా నగరానికి చేరుకుంటారు. చీఫ్ రిఫరీ, రిఫరీలు, 12 మంది, టెక్నికల్ అఫీషియల్స్ 16 మంది, స్థానిక పీడీ, పీఈటీలు 20 మంది హాజరుకానున్నారు. వీరంతా కలిపి 270 మందికిపైగా హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. వీరికి స్థానికంగా హోటళ్లలో వసతి కల్పిస్తుండగా, పోటీలు జరిగే వేదిక వద్దనే భోజన సదుపాయాలను కల్పించనున్నారు. ఇంత పెద్ద స్థాయిలో టోర్నీ నిర్వహిస్తున్న ప్రభుత్వం మాత్రం పైసా సాయం చేయడం లేదు.

అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం..



శ్రీకాకుళం వేదికగా జరిగే స్టేట్ బ్యాడ్మింటన్ పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఇక్కడకు వచ్చే క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం లేదు. క్రీడా పోటీల నిర్వహనకు ప్రభుత్వం నుంచి సాయం అందించగలిగితే ఎలాంటి పోటీలనైనా సునాయాసంగా చేయగలుగుతాయం.

– కిల్లంశెట్టి సాగర్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు

జిల్లాకు గర్వకారణం..



బ్యాడ్మింటన్ గేమ్ అంటే నాకు స్వతహాగా ఇష్టం. 2022 నుంచి సంఘ చీఫ్ ప్యాట్రన్‌గా ఉన్నాను. గత స్టేట్‌మీట్, తాజా స్టేట్‌టోర్నీకి నా వంతుగా సాయం చేశాను. మారుమూల శ్రీకాకుళం జిల్లాలో స్టేట్ మీట్ జరగడమంటే జిల్లాకు గర్వకారణమనే చెప్పాలి. అంతా సహకరించి సక్సెస్ చేయాలి. – డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, జిల్లా బ్యాడ్మింటన్ చీఫ్ ప్యాట్రన్

మెరుగైన సౌకర్యాలను కల్పిస్తున్నాం..



స్టేట్‌మీట్‌కు వచ్చే క్రీడాకారులకు మంచి ఆతిథ్యాన్ని అందించాలనేది బ్యాడ్మింటన్ సంఘ సమష్టి ఆలోచన. అందులో భాగంగానే వారికి మంచి భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తున్నాం.

– నారాయణశెట్టి వెంకట రవికిరణ్, వ్యాపారవేత్త, టోర్నీ ఫుడ్ కమిటీ కన్వీనర్

రైతుల సమస్యలు పరిష్కరించాలి

సోంపేట: కొర్లాం గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 90 నుంచి 110 సర్వే నంబర్ పరిధిలోని రైతుల సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కె.అప్పలస్వామిని తన కార్యాలయంలో సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. సర్వే నంబర్లకు సంబంధించి వన్‌–బీలు రాక పోవడంతో ఖరీఫ్ సీజన్‌లో ఈక్రాప్ కావడం లేదన్నారు.